పాడిరైతుకు అండగా..
కిసాన్ క్రెడిట్ కార్డు!

- తక్కువ వడ్డీకి బ్యాంకు నుంచి రుణాలు
- టెక్కలి నియోజకవర్గంలో 999 మంది దరఖాస్తు



పశువుల మంద

సంతబొమ్మాళి: పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వరిగడ్డి కొనుగోలు చేయాలన్నా.. పశువుల షెడ్డుకు మరమ్మతులు చేయించుకోవాలన్నా.. దాణా, కొత్తగేదెను కొనుగోలు చేయాలన్నా పశుపోషకుల చేతిలో డబ్బులు ఉండాల్సిందే. అయితే చాలా మంది రైతులు సకాలంలో డబ్బుల్లేక ఇబ్బందులు పడుతుంటారు. కనీసం రూ. పది వేలు కావాలన్నా అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వం తనవంతు సహకరిస్తోంది. పశుకిసాన్ క్రెడిట్ కార్డులకు శ్రీకారం చుట్టింది. ఈ కార్డు ఉంటే డబ్బులు అవసరమైనప్పుడు బ్యాంకులకు వెళ్లి రుణాలను తీసుకొని అవసరాలను తీర్చుకోవచ్చు.

రూ. 1.60 లక్షల వరకు పూచికత్తు లేకుండా..

పశు కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకున్న పశుపోషకులకు ఎలాంటి పూచికత్తు లేకుండా ఏడు శాతం వడ్డీపై రూ. 1.60 లక్షల రుణాన్ని బ్యాంకులు ఇస్తాయి. పూచికత్తుతో అయితే గరిష్ఠంగా రూ. 3 లక్షలు వరకు రుణాన్ని తీసుకోవచ్చు. వీటిని తిరిగి సక్రమంగా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో మూడు శాతం రాయితీ పోను ఒక శాతం మాత్రమే వడ్డీ పడుతుంది. సక్రమంగా కార్డులను వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ భారం లేకుండా ఆర్థిక అవసరాలను తీర్చుకోవచ్చు. ఎవరి వద్దా అప్పులు చేయాల్సిన పనిలేదు. ఒకసారి సక్రమంగా తిరిగి చెల్లించినట్లయితే బ్యాంకర్లే రుణం ఇచ్చేందుకు ముందుకు వస్తాయి. సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానే వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయోచ్చు. అయితే రుణాలు ఇవ్వాలంటే పశు పోషకుడికి పశువులు ఉన్నట్లుగా పశువైద్యాధికారి సర్టిఫికెట్ ఇవ్వాలి. టెక్కలి నియోజకవర్గం పరిధిలోని సంతబొమ్మాళి మండలంలో 331, టెక్కలిలో 275, కోటబొమ్మాళిలో 228, నందిగాంలో 165 మంది కార్డుల కోసం పశుపోషకులు దరఖాస్తు చేసుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పశుపోకులు కిసాన్ క్రెడిట్ కార్డును తీసుకోవడం ద్వారా వారి ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. గరిష్ఠంగా రూ. 3 లక్షలు వరకు రుణం అందిస్తాం. అధిక వడ్డీల భారం ఉండదు కాబట్టి రుణాల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదం ఉండదు. ఈ కార్డులు పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

–డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, కొత్తపల్లి పశువైద్యాధికారి, కోటబొమ్మాళి మండలం

బ్యాంకర్లు సహకరించాలి



పాడి రైతులకు ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులను రుణ నిమిత్తం అందజేయడం బాగానే ఉంది. కానీ పాడి రైతులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. పశుకిసాన్ క్రెడిట్ కార్డులకు రుణాలు ఇచ్చి బ్యాంకర్లు సహకరిస్తే పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

– ఎల్.రాములు, పాడి రైతు, నౌపడ

యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థిని గెలిపించండి



చంద్రశేఖరరావును సత్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

నందిగాం: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయు ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దాలయ్య కోరారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన జర్జాన చంద్రశేఖరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు చంద్రశేఖరరావు యూటీఎఫ్‌కు చేసిన సేవలను కొనియాడారు. జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం, ఆన్‌లైన్ పనులు తగ్గించి బోధనకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే సంస్కరణలు విద్యాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలి తప్ప కుంటుపడేలా ఉండకూడదని అన్నారు. జీఓ నెంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని కోరారు. అనంతరం నందిగాం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కె.ధర్మారావు, అధ్యక్షులుగా కుమారస్వామి, సహాధ్యక్షులుగా పి.వేణు, ఎం.బాలామణి, ట్రెజరర్‌గా కె.బాపూజీతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, ఎన్నికల అధికారిగా బాలక శంకరరావు వ్యవహరించారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం



కుమ్మరిపేటలో శిక్షణ కేంద్రం ప్రారంభంలో స్వామి దయానంద సరస్వతి శిష్యులు

కంచిలి: నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని స్వామి దయానంద సరస్వతి శిష్యులు పిరియా నంద సరస్వతి, ప్రకాశనంద సరస్వతి అన్నారు. హృషికేశ్‌లో ప్రధాన కేంద్రం, రాష్ట్రంలో గుడివాడ కేంద్రంగా సేవలందిస్తున్న స్వామి దయానంద సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో కంచిలి మండలంలో ఐదు గ్రామాలను దత్తత తీసుకొని, సంధ్యా గురుకుల కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ విద్యార్థులకు విద్యతోపాటు హిందూ ధర్మం, నైతిక విలువలు వంటి మంచి విషయాలను నేర్పించేందుకు శిక్షణ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఒడియా మాధ్యమం విద్యార్థులకు బోధించడానికి ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు. వీరితో రోజూ సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు బోధన చేపడతారని తెలిపారు. మండలంలోని కుమ్మరిపేట, జలంత్రకోట, జిల్లుండ, కుంబరినౌగాం, ముండ్ల గ్రామాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ గ్రామాలకు వచ్చిన స్వామి దయానంద సరస్వతి శిష్యులను ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త, ఉపాధ్యాయుడు లింగరాజ్ నేపక్, అపోటా అధ్యక్షుడు భాస్కర్‌పాఢి, లిమ్మేశ్ పండా, జగన్నాథ మహంతి, జోగేంద్ర మహాపాత్రో, ప్రకాశ్‌చంద్ర పండా పాల్గొన్నారు.

తగ్గించిన పాల ధరను పెంచాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘ నాయకులు, రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్: విశాఖ డెయిరీ యాజమాన్యం తీరుతో పాడి రైతులకు అన్యాయం జరుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తమ్మినాన భాస్కరరావు అన్నారు. డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల ధరను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దోకులపాడు, శారదపురం, పల్లిసారధి గ్రామాల్లోని పాల సేకరణ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. డెయిరీ నిర్వహకులు, పాల రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డెయిరీ యాజమాన్యం లీటర్ పాల ధరను రూ.2.60 నుంచి రూ.4 ల వరకు తగ్గించి రైతులకు నష్టం కలిగించి యాజమాన్యం మాత్రం కోట్లాది రూపాయాలు లబ్ధి పొందుతుందన్నారు. పాల ఉత్పత్తిదారులకు న్యాయం చేసేందుకు ఈ నెల 29న విశాఖ డెయిరీ కేంద్రం గాజువాక వద్ద చేపట్టనున్న మహాధర్నాలో అధిక సంఖ్యలో పాల రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల రైతులు, డెయిరీ నిర్వహకులతో మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

కోతులతో భయం భయం..



రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న కోతులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ వాసులను కోతులు భయపెడుతున్నాయి. గుంపులు, గుంపులుగా సంచరిస్తు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొరబడి సామాన్లను చిందర వందర చేస్తున్నాయి. వాటిని తరిమేందుకు వచ్చిన వారిపై దాడులకు తెగబడుతున్నాయి. దీంతో ప్రజలు గాయాల పాలవుతున్నారు. మార్కెట్‌కు వెళ్లి సరుకులను కొనుగోలు చేసుకొని సంచులతో తీసుకొచ్చే సమయంలో ఒక్కసారిగా దాడిచేస్తూ ఎత్తుకుపోతున్నాయి. పాఠశాలకు వెళ్లే చిన్నారులు, దేవాలయాలకు వెళ్లివచ్చే మహిళలపై దాడులకు తెగబడుతున్నాయి. ఈ వారం రోజుల్లో కోతుల దాడిలో సుమారు 15 మంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ప్రధానంగా దినవారి బజారు, మెయిన్‌రోడ్, కార్జీవీధి, దానంపేట, ప్రభుత్వాస్పత్రి రోడ్, బస్టాండ్ కూడలిలో కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల సమస్యకు పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మీదపడి కరుస్తున్నాయి



కోతులు బెడద ఎక్కువగా ఉంది. మనుషులపై దాడి చేసి కరుస్తున్నాయి. వీటితో చాలా ఇబ్బందిగా ఉంది. పిల్లలు బడికి వెళ్లి వచ్చే వరకూ భయంగా ఉంటుంది. కోతుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బి.కేదారి, కూరగాయల వ్యాపారి

నేడు ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాధర్నా

కాశీబుగ్గ: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కాశీబుగ్గ కేటి రోడ్డులో ఉన్న ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శాంతియుత మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షులు జినగ జయరాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏజెంట్లకు కొత్త విధానాలు తెచ్చి అన్యాయం చేస్తున్న కారణంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఏజెంట్లు అందరూ ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

టెక్కలి రూరల్: స్థానిక గోపీనాధపురం సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు టెక్కలి ఎస్‌ఐ రఘునాథరావు ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి గోపినాథపురం సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు రూ. 48 వేలు నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు సాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

చినవంకలో వైద్య శిబిరం



మాట్లాడుతున్న వెంకట కృష్ణారెడ్డి

వజ్రపుకొత్తూరు రూరల్: చినవంకలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మైటీ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలాసకి చెందిన మెడిని, విశాఖ మెడికవర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో జరిగిన శిబిరంలో కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటకృష్ణారెడ్డి, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ అమరనాథ్, దేవరశెట్టి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రాకేష్, ప్రతినిధులు రాంఖీ, సతీష్, సీత, జ్యోతి, గాయత్రి ఉన్నారు.

నేడు కాశీబుగ్గలో సీపీఎం నాయకుల పర్యటన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తులసీదాస్ సోమవారం ఉదయం పది గంటలకు పర్యటించనున్నారు. ఈ విషయాన్ని స్థానిక పార్టీ నాయకుడు నెయ్యిల గణపతి ఆదివారం తెలిపారు. అనంతరం గణపతి రెసిడెన్సీలో సమావేశం ఉంటుందన్నారు.

మున్సిపల్ సమావేశం రేపు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆ వాహనాలకు రక్షణ కరువు!





వివిధ కేసులో పట్టుబడి టెక్కలి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ వాహనాలకు రక్షణ లేకుండా పోయింది. రోడ్డు ప్రమాదాలు, నిషేధిత పదార్థాల అక్రమ తరలింపు సమయంలో పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, జేసీబీలు ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ పాడైపోతున్నాయి. పిచ్చి మొక్కల మధ్య వినియోగానికి పనికిరాకుండా పోతున్నాయి. అధికారులు స్పందించి వీటికి వేలం నిర్వహిస్తే ఆసక్తి ఉన్నవారు సొంతం చేసుకుంటారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

– టెక్కలి రూరల్:

రోడ్డుపైనే మురుగునీరు



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 20 వార్డు కొండపోలమ్మకాలనీలో కాలువల్లేవు. దీంతో స్థానికులు వాడుతున్న నీరు రోడ్డుపైకి చేరి పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. మురుగునీరు కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం

వరి కోతలు ఆరంభం..



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి టెక్కలి నియోజకవర్గంలో కోతలు ఆరంభమయ్యాయి. అయితే ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఎప్పటికప్పుడు తుఫాన్ పరిస్థితులు కనిపిస్తుండడంతో రైతులు కూలీలతో కాకుండా యంత్రాలతో వరి కోతలకు పూనుకున్నారు. వరి కోత కోసి ధాన్యాన్ని సైతం వెంటవెంటనే ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. భగవాన్‌పురం సమీపంలో ఆదివారం రైతులు వరికోతలకు శ్రీకారం చుట్టారు.

–టెక్కలి

అల్లుకున్న నిర్లక్ష్యం..



టెక్కలి పాత జాతీయ రహదారిలో విజారపువీధి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు



తొలుసూరుపల్లి మార్గంలో సాయి చంద్రనగర్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పేరుకుపోయిన జంగిల్

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం ఒక్కోసారిప్రమాదాలకు దారి తీస్తున్నాయి. టెక్కలిలో పలు ప్రధాన మార్గాల్లో ఉన్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్లకు జంగిల్ అల్లుకుపోయి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. తరచూ విద్యుత్ నిర్వాహణ పనులు చేపడుతున్నప్పటికీ ఇటువంటి నిర్లక్ష్య దుస్థితి కనిపించడంతో స్థానికంగా భయాందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా సంబంధింత సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రమాదకరంగా ఉన్న జంగిల్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– టెక్కలి

బాహుదాను తవ్వేస్తున్నారు!



బిర్లంగి వద్ద బాహుదానది పరిసరాల్లో మట్టి దిబ్బల నుంచి ఇసుక తీస్తున్న కూలీలు

- పట్టించుకోని అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్ఛాపురం మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రీచ్‌లు లేకపోయినప్పటికీ బిర్లంగి నదీ పరివాహక ప్రాంతంలో స్థానిక నేతలు దర్జాగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. వరదలు వచ్చేటప్పుడు బహుదానది ఉప్పొంగిన సమయంలో రక్షణగా ఉంటున్న మట్టి దిబ్బలను సైతం దొలుస్తూ లోపల ఉన్న ఇసుకను తీసుకుంటున్నారు. ఆరు నెలల క్రితం బిర్లంగి బహుదానది పరివాహక ప్రాంతంలో ఇదే మాదిరి మట్టి దిబ్బల్లోని ఇసుక తీస్తుండగా, మట్టిదిబ్బ కుప్పకూలి డ్రైవర్‌గా పనిచేస్తున్న ఒడిశా కూలి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే పదిహేను రోజుల క్రితం ఇటుకబట్టీ కార్మికుడు ఇసుక కోసం తీసిన గోతిలో పడి నదిలో కొట్టుకుపోయాడు. నదిలో ఇష్టానుసారంగా ఇసుక తీయగా ఏర్పడిన గోతులతో పలువురు గోతులో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ఇచ్ఛాపురం పట్టణంలోని బాహుదానది వంతెన దిగువ సైతం ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక తవ్వకాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.



ఇచ్ఛాపురం సమీపంలో బాహుదానది వంతెన దిగువ ఇసుక తీస్తున్న దృశ్యం



అనుమతి లేకుండా ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తున్న డ్రైవర్



ఇసుక దిబ్బ కూలి మృతి చెందిన కూలీ(ఫైల్)

క్లుప్తంగా

108 వాహన సిబ్బందికి సత్కారం



సత్కారం పొందించి 108 వాహన సిబ్బందితో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కాశీబుగ్గ: అత్యవసర సమయంలో 108 వాహన సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని మందస మండలం హరిపురం లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. పలాస డివిజన్‌లో 108 మందస మండల సిబ్బంది మురళీమోహన్, గోపాలకృష్ణ, శంకర్, రామచంద్ర, సత్యమ్‌లను హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణంలో ఆదివారం దుశ్శాలువలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ హరిప్రసాద్, జగన్, వెంకటరావు, మోహనరావు పాల్గొన్నారు.

విశాఖ జోన్‌లో సోంపేట రైల్వేస్టేషన్‌ను చేర్చాలి



రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం నినాదాలు చేస్తున్న సంఘం సభ్యులు

కంచిలి: కొత్తగా ఏర్పడబోయే విశాఖపట్నం జోన్‌లో సోంపేట రైల్వేస్టేషన్‌ను చేర్చాలని స్థానిక ప్రయాణికుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ స్టేషన్ ఖుర్దా డివిజన్ పరిధిలో ఉండటంతో అన్ని రకాలుగా వెనుకబడి ఉందన్నారు. అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే విశాఖ జోన్‌లో కలపాల్సిందేనని అంతా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. స్టేషన్ పరిధిలో సేవలు పొందుతున్న పలువురు పాల్గొన్నారు.

దోకులపాడులో ఘర్షణ

వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో ఇరు వర్గాల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సంఘ భవనంలో గ్రామ కమిటీకి సంబంధించి లావాదేవిలపై చర్చ జరిపారు. అలాగే మత్స్యకారులు ఏటా జరుపుకునే రేవు అమ్మవారి సంబరాలు గురించి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు ఎంపల్లి పాపారావు ప్రస్తావించారు. అయితే అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంబటి రామక్రిష్ణ పాపారావుపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఏ తప్పులేకుండా తనపై దాడి చేసిన రామక్రిష్ణ క్షమాపణ చెప్పాలని గ్రామ అభివృద్ధి కమిటీకి పాపారావు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం రోడ్డు పక్కన ఉన్న తోట వద్ద పాపారావు పనులు చేసుకుంటున్నాడు. అదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన అంబటి రామక్రిష్ణ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ బి.నిహార్ వద్ద ప్రస్తావించగా ఇరు వర్గాలను బైండవర్ చేసి తదుపరి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

సత్యసాయి యూనిట్ కప్ ఫైనల్‌కు పలాస



విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న నిర్వాహకులు

టెక్కలి: భగవాన్ సత్యసాయి జన్మదిన వేడుకల్లో భాగంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సత్యసాయి యూనిట్ కప్ క్రికెట్ పోటీల్లో పలాస జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఈ మేరకు ఆదివారం క్వార్టర్, సెమీ ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఇందులో టెక్కలి, పలాస, సోంపేట, పాతపట్నం జోన్‌లకు సంబంధించిన టీమ్‌లు పోటీ పడగా పలాస టీమ్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న జట్లుకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.నారాయణమూర్తి, శివ, విజయ కృష్ణ, త్రినాథరావు, ప్రశాంత్, జయవర్ధన్, జగదీశ్వర్రావు, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం



శ్యాంకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సోంపేట: బెంకిలి గ్రామానికి చెందిన సంగారు శ్యామ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ఇతనికి గ్రామస్తులు, దాతలు అండగా నిలిచారు. రూ. 42 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శ్యాంకు ఆదివారం అందజేసి వైద్యం కోసం వినియోగించుకోవాలని కోరారు. డీఎస్పీ ఎస్.ప్రసాద్, గ్రామస్తులు జుత్తు పురుషోత్తం, గుజ్జల శంకరరావు, విజయ్ పాణిగ్రాహి, సాహుకారి ప్రేమ్, బార్ల ప్రదీప్, బైరికుమార స్వామి ఉన్నారు.